సట్టా సెంటర్‌పై దాడులు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 5: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సట్టా, మట్కా నిర్వహిస్తున్న సెంటర్‌పై దాడులు నిర్వహించినట్లు గురువారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ పీ మధుసూదన్ తెలిపారు. శాంతి నగర్‌లో బండి రాజు నుంచి రూ. 32,730 నగదు, సట్టా, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

గీసుగొండ, సెప్టెంబర్ 5: మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జీపీ కార్యదర్శి కోడెపాక నరేశ్ కోరారు. ఎలుకుర్తిలో గణపతి మండలపాల నిర్వాహకులతో గురువారం సమావేశమయ్యారు. మండపాలు ఏర్పాటుకు పోలీసులు, విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలని కోరారు.

'ఓపెన్' అడ్మిషన్ల గడువు పొడిగింపు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 5: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-2025 విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల గడువును పొడిగించారని దేశాయిపేట సీకేఎం కాలేజీ అభ్యాసకుల సహాయ కేంద్రం కో ఆర్డినేటర్ ఎస్.అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, రెండేళ్ల ఐటీఐ కోర్సు, డిప్లొమా పూర్తి చేసిన ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7382929618 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'చేనేత ఉత్పత్తులను కొనాలి'

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 5: ప్రభుత్వం చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో కోరారు. చేనేత సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద నిల్వ ఉన్న బెడ్‌షీట్స్, శతరంజీలు, లుంగీలు, టవల్స్‌ను కొనుగోలు చేయకపోవడం వల్ల నేత కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నూలుపై సబ్సిడీ కొనసాగించాలని, చేనేత బీమా పథకాన్ని 75 ఏళ్ల వరకు వర్తింపజేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నెక్కొండ: అప్పల్‌రావుపేట హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు

ఘనంగా గురుపూజోత్సవం

- జిల్లావ్యాప్తంగా వేడుకలు
- పాఠశాలల్లో గురువులకు సన్మానం
- పిల్లల బాధ్యత తల్లిదండ్రుల తర్వాత గురువులదే..
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కరీమాబాద్, సెప్టెంబర్ 5: జిల్లావ్యాప్తంగా గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గురువులను సన్మానించారు. అలాగే, పిల్లలు స్వయం పాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల బాధ్యత తల్లిదండ్రుల తర్వాత గురువులదేనని చెప్పారు. విద్యార్థులు మంచి మార్గంలో నడిచేలా ఉపాధ్యాయుల బోధనలు ఉండాలన్నారు పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో టీచర్లే కీలకమన్నారు. సమాజాన్ని బాగు చేయాలంటే అది గురువులతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గురువులు చూపిన మార్గంలో నడవాలన్నారు. పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అవకాశాలను పిల్లలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాలోని 59 మందిని సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కార్పొరేటర్ పల్లం పద్మ, జిల్లా విద్యా శాఖ అధికారి జ్ఞానేశ్వర్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కరీమాబాద్: న్యూ కౌటిల్య పాఠశాల నిర్వాహకులు కోడం శ్రీధర్-సబిత దంపతులను సత్కరిస్తున్న విద్యార్థులు

గురువు లేనిదే.. సమాజ నిర్మాణం లేదు

గిర్మాజీపేట/నర్సంపేటరూరల్/నర్సంపేట/నెక్కొండ/వర్ధన్నపేట/చెన్నారావుపేట/ఖిలావరంగల్/కరీమాబాద్/గీసుగొండ/పోచమ్మమైదాన్/రాయపర్తి/సంగెం: గురువు లేనిదే సమాజ నిర్మాణం లేదని, చదువు నేర్పిన గురువులను స్మరించుకోవడం సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు మనం ఇచ్చే మహోన్నత గౌరవం అని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అరవింద్‌కుమార్ అన్నారు. వరంగల్ స్టేషన్‌రోడ్‌లోని కృష్ణ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ శరధృతిని ఆయన శాలువాతో సత్కరించారు. అలాగే, శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాలలో వేడుకలు జరిగాయి. నర్సంపేట మండలంలోని బాలాజీ టెక్నో స్కూల్, ఇంజినీరింగ్ కళాశాల, గురిజాల హైస్కూల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. నర్సంపేట పట్టణంలోని ఆచార్య డిగ్రీ, పీజీ కళాశాల, బాలాజీ పాఠశాల సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట హైస్కూల్, నెక్కొండ ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. వర్ధన్నపేట మండలవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చెన్నారావుపేటలో సిద్ధార్థ గురుకుల పాఠశాలలో చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి వేడుకలు నిర్వహించారు. శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు. వరంగల్ శంభునిపేట విశ్వనాథకాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ తన గురువులు రాజమౌళి, రాజశేఖర్ ఇంటికి వెళ్లి సత్కరించారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు విద్యా సంస్థల్లో గురుపూజోత్సం సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరీమాబాద్‌లోని న్యూ కౌటిల్య పాఠశాలలో నిర్వాహకులు కోడం శ్రీధర్-సబిత దంపతులను విద్యార్థులు సన్మానించారు. గీసుగొండ మండలంలోని జూనియర్ కాలేజీ, మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులు కేక్‌లు కట్ చేసి ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటోనగర్‌లోని లూయీస్ ఆదర్శ అంధుల పాఠశాలలో ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ తరపున డిస్ట్రిక్ట్ గవర్నర్ చిప్ప వెంకటేశ్వర్లు సన్మానించారు. రాయపర్తిలోని లహరి పబ్లిక్ స్కూల్‌లో స్వయం పాలనా దినోత్సవం నిర్వహించారు. సంగెం మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను పిల్లలు సత్కరించారు.

వర్ధన్నపేట: రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీచర్లు

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- జేడీఎం ఉప్పుల శ్రీనివాస్

కాశీబుగ్గ, సెప్టెంబర్ 5: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులతో వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మెరుగైన సేవలు అందించాలని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ సూచించారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీజన్ ప్రారంభం కానున్నందున వివిధ యార్డుల ఇన్‌చార్జీలు, ఇతర అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులు, అడ్డి, ఖరీదు వ్యాపారులతోపాటు ఇతర వ్యాపారుల పెండింగ్ పనులను త్వరగా నిర్వహించాలని సూచించారు. అలాగే, పారిశుధ్య కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి, వెంటనే పనులు నిర్వహించాలని, నిర్లక్ష్యం చేస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించారు. అలాగే, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్ పరిధిలోని హోల్‌సెల్, మినీ హోల్‌సెల్, షెడ్‌లో నిర్మించిన 158 వ్యాపారులు, రిటైల్ చిరువ్యాపారులతో విడివిడిగా సమీక్షించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీడీఎం పద్మవతి, డీఎంవో సురేఖ, గ్రేడ్-2 కార్యదర్శులు శ్రీరామోజు రాము, ధన్నపునేని అంజిత్‌రావు, అసిస్టెంట్ సెక్రటరీ గంధమల్ల రాజేందర్, సుకన్య పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ప్రోగ్రాం అధికారి మోహన్‌సింగ్

టీబీపై నిర్లక్ష్యం తగదు

గిర్మాజీపేట, సెప్టెంబర్ 5: టీబీ లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయడం తగదని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. టీబీ అంటురోగమని, దాన్ని నిర్లక్ష్యం చేస్తే ఇతరులకు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. లక్షణాలు ఉన్న వ్యక్తులు దగ్గరలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తెమడ పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే వైద్యాధికారి సూచనల మేరకు మందులు వాడాలని తెలిపారు. సమీక్షలో కో ఆర్డినేటర్ నరేశ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 5: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని సేవా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి ఉషాభాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. మానవ శరీరంలో నేత్రాలు ప్రథమ స్థానంలో నిలుస్తాయన్నారు. వాటిని కృత్రిమంగా తయారు చేయలేమని, నేత్రదానం చేసిన వారి నుంచి సేకరించిన కార్నియాను కంటిచూపు లేని వ్యక్తికి అమర్చడం వల్ల అంధత్వాన్ని దూరం చేయొచ్చన్నారు. మనిషి మరణించిన ఆరు గంటల్లోపు కంటి కార్నియాను సేకరించడం ద్వారా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో సొసైటీ వ్యవస్థాపకుడు జూపాక రత్నప్రణయ్, అధ్యక్షుడు కుమ్మరి బాబురాజ్, కోశాధికారి దూలం సందీప్, హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ వంశీప్రియ, డాక్టర్ అర్చన, డాక్టర్ ప్రమీల, నర్సింగ్ సిబ్బంది మేరీ, స్టెల్లా, మహేందర్ పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన ఆమరణ దీక్ష

గీసుగొండ, సెప్టెంబర్ 5: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రానికి చెందిన రజక రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష గురువారం 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కడెల ప్రసాద్ దీక్షా శిబిరాన్ని సందర్శించిన సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, రాజు పాల్గొన్నారు.

రాయపర్తిలో దొంగల స్వైర విహారం

రాయపర్తి, సెప్టెంబర్ 5: మండలకేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేసినట్లు ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ తెలిపారు. యాదవకాలనీకి చెందిన దాసరి లక్ష్మీదుర్గ-రాంబాబు దంపతులు ఇంట్లో లేకపోవడంతో తాళం పగులగొట్టు ఇంట్లో ఉన్న రూ. 50 వేల నగదుతోపాటు తులం బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. మండలకేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయ సమీపంలోని మురుపోజు రవి అనిత-రవి కుటుంబం ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లడంతో చోరీకి విఫలయత్నం చేశారు. క్లూస్ టీంలతో ఆధారాలు సేకరించినట్లు ఆయన వివరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 5: ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జరుపుల వీరస్వామి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గురువారం పరామర్శించారు. 36వ డివిజన్‌లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై వీరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు యాకయ్య, నాయకులు షర్ఫోద్దీన్, మధు, బాలరాజు, లత, సరోజన పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఖిలావరంగల్, సెప్టెంబర్ 5: బిర్యాని సెంటర్‌లో పని చేస్తున్న ఓ మహిళ అదృశ్యమైనట్లు గురువారం మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన సరువు స్వాతి(23) ములుగురోడ్డులోని పారడైజ్ బిర్యానీ హోటల్‌లోని కుకింగ్ సెక్షన్‌లో పని చేస్తున్నది. ఈ నెల 4న హోటల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. అలాగే, ఇటీవల అదృశ్యమైన టీ గణేశ్ ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఖిలావరంగల్, సెప్టెంబర్ 5: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. ఉర్సు బీఆర్‌నగర్‌కు చెందిన భూంపాక ప్రసాద్(33) అనారోగ్యానికి గురికావడంతో చికిత్స కోసంఅప్పు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బీఆర్‌నగర్‌కు వరద రావడంతో తన భార్య రజనీతోపాటు ఇద్దరు పిల్లలను అత్తింటిలో వదిలిపెట్టి వచ్చాడు. చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో రాజీవ్‌కుమార్

పారిశుధ్య పనులపై దృష్టి కేంద్రీకరించాలి: డీఎల్పీవో

చెన్నారావుపేట, సెప్టెంబర్ 4: గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి కేంద్రీకరించాలని డీఎల్పీవో రాజీవ్‌కుమార్ అన్నారు. గురువారం లింగగిరి గ్రామాన్ని ఆయన సందర్శించారు. బృహత్ పల్లెప్రకృతి వనం, విలేజ్ పార్కు, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్య పనులు చేపట్టాలని, చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఇంటి పన్నులను వసూలు చేసి బ్యాంకు ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో శ్రీధర్ రాజు, కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కోనారెడ్డి కట్టుకాల్వకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

కట్టుకాల్వకు మరమ్మతులు

'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

వర్ధన్నపేట, సెప్టెంబర్ 5: నియోజకవర్గ కేంద్రానికి చెందిన కోనారెడ్డి కట్టుకాల్వకు గురువారం మరమ్మతులు పూర్తయ్యాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జఫర్‌గఢ్ మండలం కోనాయిచలం గ్రామ సమీపంలోని ఆకేరువాగు నుంచి కోనారెడ్డి చెరువు వరకు గతంలో 14 కిలో మీటర్ల కట్టుకాల్వ నిర్మించారు. ఈ కాల్వలో వర్షాలు కురవగానే ప్రవహించే ఆకేరువాగు నుంచి కోనారెడ్డి పెద్ద చెరువులోకి భారీగా వరదనీరు చేరడంతో చెరువు నిండుతున్నది. కానీ, భారీ వర్షానికి ఆకేరువాగు నుంచి భారీగా నీరు కాల్వలోకి రావడంతో కట్టు కాల్వ బండౌతాపురం వద్ద కోతకు గురైంది. ఈ నెల 3న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఐబీ అధికారులతో మాట్లాడడంతోపాటు మరమ్మతులు చేయించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోనాయిచలం నుంచి కోనారెడ్డి చెరువు వరకు కాల్వ మరమ్మతులను పూర్తి చేయించారు. బండౌతాపురం గ్రామ శివారులో కోతకు గురైన కట్టుకాల్వ గట్టుకు కూడా మరమ్మతులు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టాలి

- వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నర్సంపేట రూరల్/దుగ్గొండి, సెప్టెంబర్ 5: వైద్య సిబ్బంది అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టి, జ్వరపీడితులను గుర్తించి, వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజీపేట వెంకటరమణ సూచించారు. మండలంలోని భాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. మందులు, పరిసరాలను పరిశీలించి, రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంటువ్యాధులు, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, రక్త, నీళ్ల విరోచనాలు, జ్వరాలు వ్యాప్తిచెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలు, తండాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అరుణ్‌చంద్ర, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, దుగ్గొండి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

నెక్కొండ: చెరువు మత్తడి నీళ్లను దాటుకుంటూ వెళ్తున్న డాక్టర్ అర్చన, వైద్య సిబ్బంది

భాంజీపేట పీహెచ్‌సీలో వైద్యులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఖిలావరంగల్/ఖానాపురం/గీసుగొండ/నెక్కొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. ఖిలావరంగల్‌లో డెంగ్యూ సోకిన వారి ఇంటిని ఆయన పరిశీలించారు. ఖానాపురం మండలంలోని కొత్తూరులో పల్లె దవాఖాన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్పన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో గీసుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో 62 మందికి పరీక్షలు చేశారు. నెక్కొండ మండలం చెరువుముందటితండా శివారు మర్లబోడుతండాకు చెందిన గర్భిణికి డెంగ్యూ పాజిటివ్ రావడంతో అలంకానిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అర్చన ఆధ్వరంలో తండాలో దోమల మందు పిచికారీ చేయించి, వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. కాగా, చిన్నకోర్పోలు చెరువు మత్తడి ఉధృతిని దాటుకుంటూ డాక్టర్ అర్చన, వైద్య సిబ్బంది మర్లబోడు తండాకు చేరుకొని వైద్య శిబిరం నిర్వహించడంతో తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు మండలాల్లోనే అధికం..

- 6,533 ఎకరాల్లో పంట నష్టం
- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా
- త్వరలో సర్వే పూర్తి చేస్తాం
- డీఏవో అనురాధ

వరంగల్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఇటీవలి భారీ వర్షాలతో జిల్లాలో వివిధ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి, పత్తి, మక్కజొన్న దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. ఇప్పటికే రెండు మండలాల్లో 6,533 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని అధికారులు ప్రకటించారు. ఆగస్టు 31న రాత్రి పర్వతగిరిలో 29.48, నెక్కొండలో 24.64, చెన్నారావుపేటలో 19.62 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ మూడు మండలాలు సహా ఇతర మండలాల్లోనూ పంటలకు నష్టం కలిగింది. వరద ఉధృతికి వరి కొట్టుకుపోగా, మక్కజొన్న నేలవాలింది. ఈమేరకు అధికారులు జిల్లాలో నష్టంపై సర్వే చేయగా ప్రాథమికంగా నెక్కొండ మండలంలో 4,610 ఎకరాల్లో (వరి 1,950, పత్తి 2,250, మక్కజొన్న 590) చెన్నారావుపేట మండలంలో 1,923 ఎకరాల్లో(వరి 1,008, పత్తి 735, మక్కజొన్న 180) నష్టం జరిగినట్లు కనుగొన్నారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను పంపినట్లు డీఏవో అనురాధ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సమగ్ర సర్వే చేస్తున్నామని, త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అయితే భారీ వర్షాలు తమను నిండా ముంచాయని, పెట్టుబడిని సైతం కోల్పోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది రైతుభరోసా పథకం ద్వారా వానకాలం పంట కోసం పెట్టుబడి సాయం అందజేయక పోవటం వల్ల అందినచోట అప్పు చేసి పంటలను సాగు చేస్తే వరదలు తుడిచిపెట్టుకపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నర్సంపేట మండలం గురిజాలలో నేలవాలిన మక్కజొన్న పంట

బ్రిడ్జిని ప్రారంభానికి సిద్ధం చేయాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, సెప్టెంబర్ 5: నయీంనగర్ బ్రిడ్జి పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్రిడ్జిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చాడా స్వాతి, ఎస్ఈ రాజయ్య, హార్టికల్చర్ అధికారి రమేశ్, ఏఈ సరిత పాల్గొన్నారు.

బ్రిడ్జిని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

విద్యార్థినుల సంక్షేమాన్ని విస్మరించొద్దు

- గురుకులాన్ని కడిగిన ముత్యంలా తయారు చేయాలి
- సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- అదనపు కలెక్టర్ సంధ్యారాణి

రాయపర్తి, సెప్టెంబర్ 5: ప్రభుత్వ గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినుల సంక్షేమంలో యాజమాన్యాలు ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించొద్దని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలను తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్‌తో కలిసి గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలోని తరగతి గదులు, భోజనశాల, వసతి గృహాలు, గురుకుల ఆవరణ, క్రీడా మైదానం, వంటగది, స్టాక్‌రూమ్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, బోధన, బోధనేతర సిబ్బంది, కార్యాలయాలను ఆమె కలియతిరిగారు. గురుకులంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసి కడిగిన ముత్యంలా గురుకులాన్ని తయారు చేయాలన్నారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా గురుకుల ఆవరణలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. భోజన తయారీలో నిర్వాహకులు నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని, రుచి, శుభ్రతకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి పిల్లలకు శుద్ధ జలాలు అందించా